## న్యూస్‌రీల్

### గోరటికి సాహితీ కిరీటం



'పల్లె కన్నీరు పెడుతుందో..'అంటూ 'కుబుసం' చిత్రంలోని పాటతో బహుళ ప్రజాదరణ పొందిన జానపద గాయకుడు, రచయిత, కవి గోరటి వెంకన్నకు ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు –2021 దక్కింది. ఆయన రచించిన 'వల్లంకి తాళం' అనే కవితా సంపుటికి ఈ అవార్డు లభించింది.

వివరాలు 12లో ▸

# గోరటికి సాహితీ కిరీటం

- 'వల్లంకి తాళం'ను వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
- వల్లంకి తాళంలో అడవి అందాలను ఆవిష్కరించిన గోరటి వెంకన్న
- కుబుసం చిత్రంలో 'పల్లె కన్నీరు పెడుతుందో..' పాటతో సంచలనం
- తగుళ్ల గోపాల్‌కు యువ సాహిత్య పురస్కారం
- దేవరాజు మహారాజుకు బాల సాహిత్య అవార్డు
- సంస్కృతంలో శ్వేతపద్మకు యువ పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, నాగర్‌కర్నూల్: 'పల్లె కన్నీరు పెడుతుందో..'అంటూ 'కుబుసం' చిత్రంలోని పాటతో బహుళ ప్రజాదరణ పొందిన జానపద గాయకుడు, రచయిత, కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు–2021 దక్కింది. ఆయన రచించిన 'వల్లంకి తాళం' అనే కవితా సంపుటికి ఈ అవార్డు లభించింది. డాక్టర్ సి.మృణాళిని, జి.శ్రీరామమూర్తి, డాక్టర్ కాత్యాయిని విద్మహేలతో కూడిన జ్యూరీ ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు తెలుగు విభాగంలో వెంకన్న రాసిన 'వల్లంకి తాళాన్ని' ఎంపిక చేసింది. అకాడమీ యువ పురస్కారం తగుళ్ల గోపాల్‌ను వరించింది. 'దండ కడియం' కవితా సంపుటికి ఆయనకు ఈ పురస్కారం లభించింది. బాల పురస్కారం దేవరాజు మహారాజు రచించిన 'నేను అంటే ఎవరు?' అనే నాటకానికి దక్కింది. గోరటి వెంకన్న తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా గౌరారం గ్రామానికి చెందిన వారు. తగుళ్ల గోపాల్ రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండలో జన్మించారు. దేవరాజు మహారాజు వరంగల్ జిల్లాకు చెందినవారు.

**ఆదివాసుల మట్టి.. అడవి సిరుల ఉట్టి**

గోరటి వెంకన్న తన 'వల్లంకి తాళం' కవితా సంపుటిలో అడవి తల్లి అందాన్ని, ప్రత్యేకతను అద్భుత రీతిలో వివరించారు. 'జీలుగ కల్లు.. ఇప్పపూల బట్టి.. ఆదివాసుల మట్టి.. అడవి సిరుల ఉట్టి.. అందాల అడవి..' అంటూ అడవి అందాలను అనుభవపూర్వకంగా వర్ణించారు. పల్లె పాటల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రజాదరణ పొందారు. కృష్ణ నటించిన ఎన్‌కౌంటర్ చిత్రంలోని 'జై బోలో జై బోలో అమర వీరులకు జై బోలో' ఆయన రాసిన తొలి సినిమా పాట. కుబుసం సినిమాలోని 'పల్లె కన్నీరు పెడుతుందో.. కనిపించని కుట్రలం.. నా తల్లీ బందీ అయిపోయిందో కని పించని కుట్రల' అనే పాట దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. శ్రీరాములయ్య, వేగు చుక్కలు, మహా యజ్ఞం సహా పలు సినిమాలకు పాటలు రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో గోరటికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. వెంకన్న తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కాళోజీ అవార్డు (2016), మహారాష్ట్ర ప్రభుత్వ 'కబీర్ సమ్మాన్' జాతీయ అవార్డు (2019) సహా పలు పురస్కారాలు అందుకున్నారు. పాటను నమ్ముకున్న తనకు ఈ అవార్డు లభించడం చాలా సంతోషాన్నిచ్చిందని గోరటి వెంకన్న అన్నారు.

## గోరటి వెంకన్నకు సీఎం జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2021కు ఎంపికయిన ప్రసిద్ధ వాగ్గేయకారుడు, ప్రజాకవి, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలియజేశారు. గోరటి వెంకన్న రచించిన 'వల్లంకి తాళం ' కవితా సంపుటికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ సీఎం గురువారం ట్వీట్ చేశారు. సామాన్యుడికి చేరేలా హావభావాలతోటి గ్రామీణ జానపదాలతో ఆయన ప్రజల హృదయాలు గెలిచారని, ఒక లెజెండరీగా ఎదిగారని తెలిపారు. వారి ప్రజా గేయాలు ఈనాటికీ యువకుల్లో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. ఆయనతో పాటు యువజన, పిల్లల విభాగంలో అవార్డులు గెలుచుకున్న తగుళ్ల గోపాల్, దేవరాజ్ మహారాజ్‌కు కూడా సీఎం జగన్ అభినందనలు తెలిపారు.

## శ్వేతపద్మకు సాహిత్య అకాడమీ అవార్డు



యూనివర్సిటీ క్యాంపస్ (తిరుపతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్వేతపద్మ శతపతి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార్- 2021కి ఎంపికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ 22 భాషల్లో యువ పురస్కారాలను గురువారం ప్రకటించింది. ఇందులో సంస్కృత భాష నుంచి శ్వేతపద్మ ఎంపికయ్యారు. ఆమె రచించిన కథా సంకలనం కథకల్పనకు ఈ అవార్డు లభించింది. త్వరలో నిర్వహించే కార్యక్రమంలో ఆమెకు రూ.50 వేల నగదు, క్యాంస్య పతకం, ప్రశంసాపత్రం అందజేస్తారు. సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీ హరేకృష్ణ శతపతి కుమార్తె శ్వేతపద్మ. ఒడిశాలోని కటక్‌లో జన్మించిన ఈమె ప్రాథమిక విద్య అక్కడే చదివారు. ఉన్నత విద్య తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. తొమ్మిదేళ్లుగా ఇక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థి దశలో నాలుగు బంగారు పతకాలు, జాతీయ సంస్కృత ప్రతిభ ఉత్సవాల్లో 'వనిత వైజయంతి' అవార్డు గెలుచుకున్నారు. 5 పుస్తకాలు రచించారు. 30 పరిశోధన పత్రాలు ప్రచురించారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన శ్వేతపద్మను పలువురు అభినందించారు.